క్లుప్తంగా

కొత్త బస్సులు ప్రారంభం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండులో శుక్రవారం ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు, డీపీటీఓ జగదీష్ కొత్త బస్సు సర్వీసులను ప్రారంభించారు. చిత్తూరు – బెంగళూరుకు కొత్తగా నాలుగు ఎక్స్‌ప్రెస్ బస్సులు, చిత్తూరు నుంచి హైదరాబాద్‌కు ఒక సూపర్ లగ్జరీ బస్సును తీసుకొచ్చారు. చిత్తూరు నుంచి అనుపల్లికి పల్లె వెలుగు సర్వీసును ప్రారంభించారు. ఈ సర్వీసులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

వరసిద్ధునికి రూ.5 లక్షల విరాళం



నగదు విరాళం అందజేస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అన్నదానం ట్రస్టుకు శుక్రవారం ఓ దాత నగదు విరాళం చేశారు. కడపకు చెందిన దినేష్‌రెడ్డి రూ.5,00,116 నగదును ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, రవి తదితరులున్నారు.

ఈఈ కార్యాలయం కేటాయింపు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో రూరల్ ఈఈ కార్యాలయానికి భవనాన్ని కేటాయిస్తూ కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారని ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు. జిల్లాకు నూతనంగా ట్రాన్స్‌కో సర్కిల్ కార్యాలయం కేటాయించారన్నారు. దీంతో రూరల్ డివిజన్ కార్యాలయం నుంచి ఎస్ఈ కార్యాలయ సేవలు ప్రారంభించామని చెప్పారు. అక్కడ రెండు కార్యాలయాల నిర్వహణకు స్థలం చాలలేదన్నారు. దీంతో రూరల్ కార్యాలయం కోసం పాత కలెక్టరేట్‌లో గతంలో మైన్స్ కార్యాలయం ఉన్న భవనాన్ని కేటాయించాలని కలెక్టర్‌కు విన్నవించామన్నారు. దీంతో ఆ భవనంలో కార్యాలయం ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు ఇచ్చారని వివరించారు.

భూ సమస్యలను పరిష్కరించండి



అర్జీలు అందజేస్తున్న రైతులు

బంగారుపాళెం: రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యలను పరిష్కరించాలని రైతులు గ్రామ సభలో అధికారులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని శెట్టేరి రెవెన్యూ గ్రామంలో శుక్రవారం రెవెన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ సభలో 11, కొలతల్లో తేడాలు 25, దిద్దుబాటుకు సంబంధించి 3 మొత్తం 39 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. భూ రీసర్వే డీటీ బాబు, మండల సర్వేయర్ లావణ్య, విలేజ్ సర్వేయర్ రాజేష్, వీఆర్‌ఓ కిషోర్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

15 ఎకరాల్లో వరి పంట నష్టం



నలిశెట్టిపల్లెలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి ప్రవీణ్

తవణంపల్లె: మండలంలో తుపాను తాకిడికి మండలంలో 15 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారి ప్రవీణ్ తెలిపారు. మండలంలో భారీ వర్షాలు కురవడంతో రైతులు కష్టపడి పండించిన వరి పంట నేలకొరిగింది. పలు చోట్ల వరి గింజలు మొలకలు వస్తున్నాయి. మళ్లీ వర్షాలు కురిస్తే వరి పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది. మండలంలో తుపాను ప్రభావం వల్ల నష్టపోయిన వరి పంటను పరిశీలించి పరిహారం అందించడానికి జిల్లా అధికారులకు నివేదిక పంపుతానని ఏఓ ప్రవీణ్ తెలిపారు. నలిశెట్టిపల్లె పంచాయతీలో శుక్రవారం దెబ్బతిన్న వరి పంటను పరిశీలించి అంచనాలు తయారు చేశారు. ఏఓతో పాటు రైతు సేవా కేంద్రం సిబ్బంది నందన, రైతులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో ఎన్టీఆర్ తనయుడు



రామకృష్ణకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

కాణిపాకం: కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చూశారు. అనంతరం స్వామి వారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. సిబ్బంది వాసు, విగ్నేష్ పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం.. అస్తవ్యస్తం!

- నిర్వీర్యమవుతున్న సచివాలయ వ్యవస్థ
- గతంలో 545 సేవలు అందుబాటులో
- నేడు గందరగోళ పరిస్థితి
- పనిలేక ఖాళీగా ఉద్యోగులు



వసంతాపురంలో గత ప్రభుత్వం నిర్మించిన గ్రామ సచివాలయం, హెల్త్‌సెంటర్, ఆర్‌బీకే

గుడిపాల: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరంతరం కృషి చేసింది. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ఉద్యోగులు, వలంటీర్లను నియమించి ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ వ్యవస్థకు తూట్లు పొడిచింది. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను మాయం చేసిన చంద్రబాబు ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నింది. జగనన్న పాలనలో సచివాలయాల ద్వారా 545 సేవలు గ్రామీణులకు అందేవి. నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. అంతా గందరగోళంగా మారింది. ప్రభుత్వం ఏర్పాటై అయిదు నెలలు దాటినా, రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డుల వెబ్‌సైట్లు ఇంతవరకు ఓపెన్ కాలేదు. ఫలితంగా అనేకమంది దరఖాస్తుదారులు అవస్థలు పడుతున్నారు.

సచివాలయ ఉద్యోగులే దిక్కు

నాడు టీడీపీ నేతలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సచివాలయ ఉద్యోగుల పట్ల వివక్షతో అనేక విమర్శలు చేశారు. అవహేళనగా మాట్లాడారు. కానీ నేడు కూటమి సర్కారుకు పింఛన్ల పంపిణీకి సచివాలయ ఉద్యోగులే పెద్ద దిక్కయ్యారు. అంతేగాక ఇటీవల కూటమి ప్రభుత్వం చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో స్టిక్కర్లు అతికించే దగ్గర నుంచి, ఇంటింటా ప్రచారం వరకు వీరినే ఉపయోగించి వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీశారు. నోటికి వచ్చిన అబద్ధపు హామీలను కుమ్మరించి, గద్దె నెక్కిన కూటమి సర్కార్ మొదట్లోనే సూపర్ సిక్స్‌ని తుంగలో తొక్కింది. వాటి అమలుపై ప్రజలు ఎక్కడ నిలదీస్తారో ప్రశ్నిస్తారోనని.. రోజుకో సమస్యను సృష్టించి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది. తిరుమల శ్రీవారి లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చి కొంతకాలం వెళ్లదీసింది. అయితే అది తప్పుడు ప్రచారమని తేలిపోవడంతో ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం మరింత సడలింది. ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు గడుస్తున్నా సూపర్ సిక్స్ అమలు కాకపోవడంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాడు కళకళ.. నేడు వెలవెల

గత ప్రభుత్వం రెండు వేల జనాభా ఉన్న గ్రామంలో రూ.40 లక్షలతో సచివాలయం, రూ.21లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో హెల్త్‌సెంటర్ ఏర్పాటు చేసింది. కొన్ని నెలల క్రితం వరకు వివిధ సంక్షేమ పథకాల అమలుతో ప్రజలు, లబ్ధిదారుల రాకపోకలతో కళకళలాడిన సచివాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. గుడిపాలలో మొత్తం 27 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 17 గ్రామ సచివాలయాలు ఉండగా 140 మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో సేవలందక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు ఉద్యోగులు పనిలేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి. కేవలం నెల ప్రారంభంలో ఆ ఉద్యోగుల ద్వారా పింఛన్ల పంపిణీ మాత్రమే చేయిస్తుంది. సంక్షేమ పథకాల అమలు లేకపోవడం, సేవలు నిలిచిపోవడంతో కార్యాలయాలు వెలవెలబోతున్నాయి.

దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్లు ఇంకా ఓపెన్ కాలేదు

సచివాలయంలో పింఛన్లు, రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్లు ఇంకా ఓపెన్ కాలేదు. వెబ్‌సైట్లు ఎప్పుడు ఓపెన్ చేస్తారనే దానిపై సమాచారం లేదు. ఈ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం నుంచి అనుమతి ఇచ్చినప్పుడు వెంటనే అది అమలయ్యేలా చూస్తాం. సచివాలయ ఉద్యోగుల వినియోగంపై ప్రభుత్వ నిర్ణయం తీసుకుంటుంది. ఉన్నతాధికారులు, పాలకుల సూచన మేరకు నడుచుకుంటాం.

–శివరాజన్, ఎంపీడీవో, గుడిపాల

టపాసుల విక్రయాలు ప్రారంభం



బాణసంచా దుకాణం ప్రారంభిస్తున్న దృశ్యం

గుడిపాల: రైతులకు, వినియోగదారులకు తక్కువ ధరలకే బాణసంచా సామగ్రిని విక్రయిస్తున్నట్లు గుడిపాల ప్రాథమిక సహకార సంఘం స్పెషలాఫీసర్ కేవీఆర్ కుమార్ అన్నారు. దీపావళి బాణసంచా దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు, వినియోగదారులకు సరసమైన ధరలకు టపాకాయలను విక్రయించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఆయనతో పాటు సీఈఓ పట్టాభి, సిబ్బంది సెల్వం, జయరాజ్, జితేంద్ర పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలపై దృష్టి



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఏసీపీ నాగేంద్ర

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఎక్కడైనా అనధికార నిర్మాణాలు జరుగుతుంటే వాటిని రెగులర్ చేయాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం టీపీవో శుభప్రదతో కలిసి సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో రోడ్ల విస్తరణపై దృష్టి పెట్టాలని ఇప్పటికే ప్రజా ప్రతినిధులు ఆదేశించారన్నారు. దానికి తగ్గట్టు ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు. అక్రమ లే-అవుట్లు, అనుమతి లేకుండా జరుగుతున్న నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో గుర్తించాలని వివరించారు.

గ్రామసభల్లో సమస్యల వెల్లువ



గ్రామసభలో సమస్యలు తెలుపుతున్న రైతులు

గుడిపాల: రీసర్వేలో అధికారుల తప్పిదాలపై రైతుల నుంచి సమస్యలు వెల్లువలా వచ్చాయి. వసంతాపురంలో రీసర్వేపై సర్పంచ్ రజినీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ఇందులో భాగంగా కొంతమంది రైతులు వచ్చి తమ సర్వే నంబర్లే పాస్‌బుక్‌లో లేవని వారు మండిపడ్డారు. ఫీల్డ్‌కు రాకుండానే రీసర్వేలు చేసి రైతుల ప్రాణాలతో ఆడుకుంటున్నారని చెప్పారు. బ్యాంకుల్లో క్రాప్‌లోన్‌లు తీసుకుని సకాలంలో చెల్లిస్తున్నప్పటికీ తమకు ప్రస్తుతం సచివాలయాల్లో 1బీలు రాకుండా చాలా ఇబ్బందులు పడుతున్నామని బ్యాంకు వారు వడ్డీలపై వడ్డీలు వేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా రీసర్వే డెప్యూటీ తహసీల్దార్ రూపిదేవి మాట్లాడుతూ రీసర్వేలో తప్పులు వచ్చిన వాటిని సరిదిద్దేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ గోపి, కమ్యూనిటీ సర్వేయర్ కిరణ్, వీఆర్‌ఓలు గోపి, శ్రీనాథ్‌రెడ్డి, విలేజ్ సర్వేయర్‌లు భాను, సరిత, చరణ్ పాల్గొన్నారు.

అనధికార గైర్హాజరుకు సంజాయిషీ నోటీసు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని బైరెడ్డిపల్లి మండలం లక్కనపల్లి ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో విధులకు గైర్హాజరైన టీచర్ అరుణకుమారి లిఖిత పూర్వక సంజాయిషీ ఇవ్వాలని డీఈఓ దేవరాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన నోటీసు జారీచేశారు. లక్కనపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న అరుణకుమారి గత ఏడాది జూలై 31 నుంచి విధులకు హాజరుకావడం లేదన్నారు. దీనిపై ఆర్టికల్ ఆఫ్ చార్జ్ ఉత్తర్వులను ఆమెకు అందజేసేందుకు సంబంధిత చిరునామాలో ఆమె లేదని తెలిపారు. ఆమె వెంటనే డీఈఓ ఎదుట హాజరుకావాలన్నారు. లేని పక్షంలో ఏపీ సివిల్ సర్వీసెస్ ప్రవర్తన నియమావళి 1991 ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఈఓ తెలిపారు.

రహదారి మురుగునీరు పొలాల్లోకి..



సమావేశంలో ఎమ్మెల్యే మురళీమోహన్, డీఆర్వో పుల్లయ్య, ఆర్డీఓ శ్రీనివాసులు

పూతలపట్టు: జాతీయ రహదారి పక్కనున్న పొలాల్లోకి మురుగునీరు రావడంతో రైతులంతా తీవ్ర ఆవేదనకు గురయ్యారు. దీనిపై రహదారుల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పేట అగ్రహారానికి చెందిన బాధిత రైతులు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే మురళీమోహన్, డీఆర్వో పుల్లయ్య, ఆర్డీఓ శ్రీనివాసులు, హైవే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా రహదారికి భూములిచ్చిన రైతులు పరిహారం విషయమై చర్చించేందుకు నిర్ణయించారు. అయితే రైతులు మురుగు సమస్యను లేవనెత్తడంతో అధికారులు నోరు మెదపలేదు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులకు అవగాహన కల్పించకుండా సమావేశానికి పిలిపించడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని నేషనల్ హైవే పక్కనున్న పొలాల్లోకి మురుగునీరు వెళుతోందని రైతులు తెలిపారు. ఈ విషయమై ఎన్నిసార్లు హైవే అధికారుల వద్దకు వెళ్లినా పీడీ రూం బయట నుంచే పంపిచేస్తున్నారని వాపోయారు. అయితే దీనిపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేస్తూ రైతులకు పూర్తి సమాచారం అందజేసిన తరువాత సమీక్ష నిర్వహించాలని ఆదేశించి, సమీక్ష మధ్యలోనే బయటకెళ్లిపోయారు.

స్టోర్స్‌లో ఆయుధ పూజ

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా స్టోర్స్ కార్యాలయంలో శుక్రవారం ఆయుధ పూజ నిర్వహించారు. దసరా, దీపావళి పండుగల సందర్భంగా స్టోర్స్‌లో పూజలు చేశారు. అమ్మవారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, వాహనాలకు పూజలు చేశారు. ఉద్యోగులు, హమాలీలకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్, ఈఈలు మునిచంద్ర, సురేష్, డీఈ బాలాజీ, ఏఈలు మోహన్‌రావు, బాలగుణయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి అనూష అన్నారు. మండలంలోని రాసనపల్లె గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శిరీష, దివ్య, ఉమామహేశ్వరి, మల్లిక పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురు అరెస్ట్

చిత్తూరు అర్బన్: నగరంలో పేకాడుతున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సీఐ జయరామయ్య తెలిపారు. నగరంలోని ఎస్టేట్ శివారులో పేకాడుతున్నట్లు పోలీసులకు శుక్రవారం సమాచారం అందింది. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు దాడులు నిర్వహించగా, పేకాట ఆడుతున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.4 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు.

యాప్ ద్వారా పశుగణన వివరాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు

గుడిపాల: యాప్ ద్వారా పశుగణన వివరాలను సేకరిస్తున్నట్లు పశువైద్యాధికారులు సాయిసుధ, రవితేజ అన్నారు. స్థానిక పశువైద్య కేంద్రంలో శుక్రవారం పశుగణన వివరాల వాల్‌పోస్టర్లను వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అక్టోబర్ 25 నుంచి, వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ ప్రతి ఇంటికీ వెళ్లి పశువుల వివరాలు సేకరించనున్నట్లు వివరించారు. మండలంలో ఇద్దరు సూపర్‌వైజర్లు, 17మంది ఎన్యూమరేటర్లు ద్వారా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రతి ఇంటికీ వెళ్లి పశువులు ఎన్ని ఉన్నాయి, గొర్రెలు, మేకలు, కోళ్లు, కుక్కలతో పాటు రైతులు వ్యవసాయ సాగుబడి కోసం ఉపయోగిస్తున్న పనిముట్ల వివరాలను సేకరించి పశుగణన యాప్‌లో నమోదు చేస్తామన్నారు. ఎన్యూమరేటర్లు రైతు సోదరుల ఇంటిలో పశువుల గణన పూర్తయినట్లు ఇంటికి స్టిక్కర్ అతికిస్తారని తెలిపారు. ఈ వివరాలతో పశువులకు రోగాలు ప్రబలినప్పుడు వ్యాక్సినేషన్, మెడిసిన్‌కు సంబంధించి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

రైతులు పశుగణనకు సహకరించాలి



నలగాంపల్లెలో పశుగణన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, పశుసంవర్ధకశాఖ అధికారులు

బంగారుపాళెం: అఖిల భారత పశుగణన కార్యక్రమానికి రైతులు సహకరించాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మండలంలోని నలగాంపల్లెలో శుక్రవారం పశు గణన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, చాలా మంది రైతులు పాడి రైతులపై జీవనం సాగిస్తున్నారని చెప్పారు. పాడిరైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ, 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం ఈ నెల 25వ తేదీ నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. మండలంలో పశుగణన కోసం 18 మంది ఎన్యూమరేటర్లను నియమించామన్నారు. రైతులు పశుగణన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీడీ ఆరీష్, బంగారుపాళెం ఏడీ ఆసిఫ్, నలగాంపల్లె పశువైద్య కేంద్రం డాక్టర్ ఝూన్సీ, మాజీ ఏఎంసీ చైర్మన్ జయచంద్రనాయుడు, జయప్రకాష్, జనార్దన్‌గౌడ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ హేమచంద్రనాయుడు, ధరణి పాల్గొన్నారు.


కట్టకిందపల్లెలో 35 మందికి వైద్య పరీక్షలు

తవణంపల్లె: మండలంలోని కట్టకిందపల్లెలో వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ 35 మంది రోగులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా కట్టకిందపల్లెలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ పల్లెల్లో దోమలు వ్యాప్తి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. దోమ కాటుకు గురికాకుండా దోమ తెరలు, వాడాలని, వేపాకు పొగ వేయడం మంచిదన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి లార్వా దశలోనే నాశనం చేయాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలని సూచించారు. గర్భవతులు రక్తహీనత రాకుండా ఐరన్ మాత్రలు వాడాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తరాలకు బహుమతులు



మదిలో మెదిలే భావాలకు అక్షర రూపం ఇస్తే, అది చదివిన వారు కళ్లముందు జరిగినట్లుగా ఊహాలోకంలో విహరించేవారు. చేతిరాత లేఖల ద్వారా సంభాషణలు జరిగేవి. మనుషులు, మనసుల మధ్య భావాలకు ప్రతిరూపాలే ఈ లేఖలు. అది రాయడంలో, చదవడంలో ఒక అనుభూతి ఉంటుంది. చదువుతున్నప్పుడు ఎదుటి వ్యక్తి మనతో మాట్లాడుతున్నట్లు అనిపించి వారి రూపం గుర్తుకు వస్తుంది. గతంలో ఉత్తర, ప్రత్యుత్తరాల ద్వారానే సమాచార మార్పిడి జరిగేది. కాలక్రమేణా స్మార్ట్ ఫోన్‌లు ప్రపంచాన్ని అరచేతిలోకి తీసుకువచ్చాయి. దీంతో లేఖలు అదృశ్యమైపోయాయి. నేటి తరం ఫోన్‌కే అంకితమైపోతోంది. అయితే లేఖ రచనపై అవగాహన కల్పించేందుకు నేటి తరానికి ఆ అనుభూతి రుచి చూపించేందుకు తపాలాశాఖ పోటీలు నిర్వహిస్తోంది. దీనిపై ప్రత్యేక కథనం.



- తపాలా ఆధ్వర్యంలో లేఖ రచన పోటీలు
- డిసెంబర్ 14న ఆఖరి గడువు
- డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియాపై లేఖరచన

చిత్తూరు కార్పొరేషన్: ప్రస్తుతం ఫార్వార్డ్ మెసేజ్‌ల ట్రెండ్ నడుస్తోంది. గుడ్‌మార్నింగ్ నుంచి గుడ్‌నైట్ వరకు.. పుట్టినరోజు నుంచి సంతాపం వరకు ఇలా ప్రతి సంఘటనను ఫార్వార్డ్ మెసేజ్‌ల ద్వారా తెలపడం నేడు సాధారణమైపోయింది. ఉత్తరాల కాలంలో మనసులోని భావం చేతిరాతతో రాసి ఉత్తరాల ద్వారా పంపేవారు. వాటి అవశ్యకతను తెలపడానికి తపాలాశాఖ లేఖరులకు పోటీలు నిర్వహిస్తోంది. వీటి పై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా

ప్రస్తుత డిజిటల్ యుగంలో ఉత్తరాల ప్రాధాన్యం తగ్గింది. దూర ప్రాంతాల్లో ఉన్నవారి క్షేమం తెలియజేయాలన్నా, వ్యాపార అవసరాల నిమిత్తం సమాచారం పంపించాలన్నా ఒకప్పుడు కలం తీసుకుని లేఖలు రాసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఒకప్పటి సమాచార సాధానాన్ని నేటి తరానికి తెలియజేయడానికి ×డిజిటల్ యుగంలో లేఖా రచన అవశ్యకత¥ అనే అంశంపై లేఖల పోటీలకు ఆహ్వానం పలుకుతోంది. ఈ పోటీలకు 18 ఏళ్ల లోపు ఒక కేటగిరి, 18 ఏళ్లు పైబడిన వారిని మరో కేటగిరిగా విభజించారు. తెలుగు, హిందీ, ఆంగ్లం, భాషల్లో వ్యాసం రాయవచ్చు. డిజిటల్ విధానంలో పాలన, మౌలిక సదుపాయాలు, అక్షరాస్యత, డిజిటల్ పేమెంట్స్ తదితర అంశాలను పొందుపరచాలి. చేతితో రాసిన వ్యాసం మాత్రమే అనుమతిస్తారు. ఎన్వలాప్ కవర్ అయితే వెయ్యి పదాలు మించరాదు, ఇన్‌లాండ్ లెటర్ అయితే 500 పదాలకు మించకుండా రాయాల్సి ఉంటుంది.

ఇలా రాసిన ఉత్తరాలు ది పోస్టల్ సూపరింటెండెంట్, ప్రధాన తపాలా కార్యాలయం, చిత్తూరు చిరునామాకు డిసెంబర్ 14వ తేదీలోగా పంపాలి.

బహుమతులు

విభాగాల వారీగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజేతలను ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ఒక్కో విభాగంలో మొదటి 3 స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతి అందజేస్తారు. సర్కిల్ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు వరుసగా రూ.25వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేస్తారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారికి జాతీయ స్థాయికి పంపుతారు. జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం రూ.50 వేలు, ద్వితీయ స్థానం రూ.25 వేలు, తృతీయ స్థానం విజేతకు రూ.10 వేలు అందజేయనున్నారు.

లేఖలు రాయడానికి అవకాశం

చేతిరాతతో ఉత్తరాలు రాయడాన్ని తపాలాశాఖ ప్రోత్సాహిస్తోంది. గతంలో ఎక్కువగా ఉత్తరాల ద్వారా సమాచారాన్ని చేరవేసేవారు. ప్రస్తుతం రాయడం మరిచిపోతున్నారు. వీటిని గుర్తించి తపాలా ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఇటువంటి పోటీలు నిర్వహించడం వల్ల ఉత్తరాన్ని పరిచయం చేసినట్లవుతుంది.

–లక్ష్మణ, సూపరింటెండెంట్, తపాలాశాఖ

మొగిలి ఘాట్‌లో ఢీకొన్న వాహనాలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్‌లోని దొరచెరువు వద్ద శుక్రవారం జాతీయ రహదారిపై మూడు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో వాహనాలు దెబ్బతిన్నాయి. ప్రయాణికులకు ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. పలమనేరు వైపు నుంచి చిత్తూరు వైపు ప్రయాణిస్తున్న వాహనాలు మొగిలిఘాట్‌లో దొరచెరువు సమీపంలో ఏరాటు చేసిన స్పీడ్ బ్రేకర్ వద్ద ఢీకొన్నాయి. ముందుపోతున్న లగేజీ ఆటోను కారు, కారును వెనుకనే వస్తున్న లారీ ఢీ కొంది. అదేవిధంగా గురువారం బెంగళూరు నుంచి చెన్నై బయల్దేరిన కంటైనర్ డివైడర్‌ను ఢీకొని రోడ్డుపైకి దూసుకు వెళ్లింది. ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. ఎదురుగా వాహనాలు వచ్చి ఉంటే ప్రాణాపాయం జరిగి ఉండేదని ప్రయాణికులు, వాహనదారులు పేర్కొన్నారు. ప్రమాదాల నియంత్రణకు పోలీసులు, అధికారులు అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటున్నా ఫలితం మాత్రం శూన్యం.



మొగిలి ఘాట్‌లో స్పీడ్ బ్రేకర్ వద్ద ఢీకొన్న వాహనాలు